క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తకు షోకాజ్ నోటీస్

సాలూరు: అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు, రామాకాలనీ–3 అంగన్‌వాడీ కార్యకర్త బలగ రాధకు ఐసీడీఎస్ అధికారులు ఆదివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటీవల ఆమెపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించారు. తనపై వచ్చిన అభియోగాలపై వివరణ అడుగుతూ షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణ

భామిని: మండలంలోని కీసర గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామకృష్ణ స్వయంగా ఫాగింగ్ మిషన్‌తో గ్రామం మొత్తం దోమల మందు కొట్టారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు స్థానిక సర్పంచ్ వలరౌతు పద్మావతి అన్నారు.

కళాశాలకు భవనాన్ని కేటాయించరూ..



ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనం

వీరఘట్టం: స్థానిక వెలుగు కార్యాలయం పక్కన సుమారు ఏడేళ్ల కిందట రూ.2 కోట్ల వ్యయంతో సమీకృత వసతి గృహం నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఇంతవరకు ఈ భవనాన్ని ప్రారంభించలేదు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో తరగతుల నిర్వహణ కష్టమవుతోంది. విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడ విద్యార్థుల పరిస్థితిని గుర్తించి ఖాళీగా ఉన్న ఈ భవనాన్ని డిగ్రీ కళాశాలకు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

చినకుదమలో విషాదఛాయలు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ గ్రామానికి చెందిన నల్ల సాయికార్తీక్ నాయుడు(20) కర్నూలు ట్రిపుల్ ఐటీ(డీఎం)లో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతూ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కొడుకు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామస్తులందరితో మంచిగా ఉంటూ బాగా చదువుకుంటున్న వ్యక్తి ఇలా చేసుకోవడంతో గ్రామస్తులంతా విచారం వ్యక్తం చేస్తున్నారు. మృతుని తండ్రి వెంకటనాయుడు వ్యవసాయం చేస్తుండగా, తల్లి అంగనవాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. చెల్లి నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతోంది. కుమారుడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో అంతుపట్టడం లేదని తల్లిదండ్రులు బాధపడుతున్నారు.

జోరుగా దమ్ములు



ఆర్తాంలో ముమ్మరంగా సాగుతున్న దమ్ములు

కొమరాడ: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటపొలాలు, చెరువులు, సాగునీటి కాలువల్లో నీరు చేరడంతో రైతులు ఖరీఫ్ దమ్ముల్లో నిమగ్నమయ్యారు. పొలాలను చదును చేసి వరినాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదేవిధంగా ఈ సీజన్ మొత్తం వాతావరణం అనుకూలంగా ఉంటే ఆశించిన దిగుబడులు చేతికొస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జంఝావతి రబ్బరు డ్యాం ఎడమ కాలువ ద్వారా సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుండడంతో ఆర్తాం, గంగారేగువలస, విక్రంపురం, పరుశురాంపురం, చంద్రపీట, తదితర గ్రామలో ఉబాలు జోరందుకున్నాయి.

అప్రమత్తం

భామిని: సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. భామిని మండలం బత్తిలి వద్ద ఎస్సై చేకూరి ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశాలోని రాయగడ జిల్లా అటవీ ప్రాంతంలో గతంలో మావోయిస్టు కార్యకలాపాలు జరిగిన నేపథ్యంలో ఒడిశా వైపు నంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అటు ఒడిశా సరిహద్దులో ప్రత్యేక పోలీసు బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. ఏటా జూలై 28 నుంచి ఆగస్టు 4 వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తారు.

ఈ సమయంలో మావోయిస్టులు ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశం ఉండడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

ఆందోళనలో అన్నదాత..

- డీఏపీ ఎరువు కోసం ఎదురుచూపులు
- 2,500 ఎకరాల్లో వరి వెదలు
- 15 వేల ఎకరాల్లో ఉబాలు పూర్తి



కాశీపేటలో వరి పొలం

సీతానగరం :

డీఏపీ ఎరువు కోసం మండల రైతాంగం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వెదలు, ఉబాలు పూర్తి కావడంతో ఎరువులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. దమ్ములోనే డీఏపీ, యూరియా కలిపి వేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉబాలు, వెదలు పూర్తి చేసిన పొలాల్లో డీఏపీ వేయకపోవడంతో నారు పెరుగుదల రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్‌బీకేలు, పీఏఎస్‌ల ద్వారా ఈ సమయానికే ఎరువులు పంపిణీ చేశారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలను పక్కనబెడితే ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో డీఏపీ ఉందా అని అడిగితే కాంప్లెక్స్ ఎరువులున్నాయన్న సమాధానం వస్తుందే తప్ప, అడిగిన ఎరువు ఇవ్వడం లేదని చెబుతున్నారు. మండలంలోని 17, 500 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా.. 800 ఎకరాల్లో చెరుకు సాగవుతోంది. దీంతో ఆయా పొలాల్లో సుమారు 420 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువు అవసరం అవుతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇంతవరకు 240 టన్నుల డీఏపీ మండలానికి వచ్చిందని లెక్కలు చెబుతున్నాయి. అయితే ఆ ఎరువు ఎవరికి పంపిణీ చేశారో అర్థం కాని పరిస్థితి. మరో పది రోజుల్లో పైరుకు డీఏపీ వేయకపోతే ఎండిపోయే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి డీఏపీ ఎరువు అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఉబాలు పూర్తి చేశాం. డీఏపీ వేయకపోవడంతో వరి మొనలు పది రోజుల వుతున్నా పెరుగుదల లేదు. యూరియా, సూపర్, డీఏపీ కలిపివేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు స్పందించి ఎరువులను పంపిణీ చేయాలి.

– టి. శ్రీనివాసరావు, రైతు, కాశీపేట

రెండు రోజుల్లో అందిస్తాం..



ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు అవసరమైన ఎరువులను మొదటి విడతలో సమకూర్చాం. అన్ని ప్రాంతాల్లో ఒకేసారి డీఏపీ కొరత ఏర్పడింది. రెండు రోజుల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువు అందించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

– ఎస్. అవినాష్, ఏఓ, సీతానగరం

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి..

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతానగరం: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జోగింపేట గిరిజన ప్రతిబా స్కూల్‌ను (స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. ముందుగా వంటగది, సరుకులు నిల్వ చేసే గది, డార్మిటరీ, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, మౌలిక సదుపాయాలు, బోధన, సమస్యలపై ఆరా తీశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు.

విద్యార్థులతో భోజనం..

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. నలుగురికీ సహాయపడే స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఉన్నత రంగాలకు చేరితే ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో వాలీబాల్ ఆడి వారిలో ఉత్తేజం నింపారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధం

గుమ్మలక్ష్మీపురం: గరుగుబిల్లి మండలం శివం గ్రామానికి చెందిన దళితుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిన సీపీఎం నాయకులను ఆదివారం రాత్రి పోలీసులు గృహనిర్బంధం చేశారు. కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా నోటీసులు అందజేశారు. సీపీఎం నాయకులు కోలక అవినాష్‌కు ఇరిడి గ్రామంలోని ఆయన స్వగృహంలో నిర్బంధించారు. అలాగే మరో నాయకులు మండంగి రమణకు నోటీసులు అందజేశారు. దీనిపై వారు స్పందిస్తూ.. ప్రజా సమస్యలపై న్యాయ పోరాటాలకు సిద్ధమవుతున్న తమపై ఇటువంటి చర్యలకు దిగడం సరికాదన్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై చర్చిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు కోరారు. సీతంపేటలో ఆదివారం యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జీపీఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలకు రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు మురళి, జ్యోతి, గోవిందమ్మ, కె.కృష్ణారావు, పి.వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



సమావేశంలో పాల్గొన్న కళాకారులు

గరుగుబిల్లి: మండలలోని తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారపురెడ్డి ధనుంజయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కనుమరుగవుతున్న వివిధ కళలను బతికించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కళలకు పుట్టినిల్లయిన మన దేశంలో పూర్వం నుంచి అనేక కళారూపాలు ప్రజాదరణ పొందుతూ వచ్చాయన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో కళారూపాలు ఒక్కొక్కటిగా అంతమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళలను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సలహాదారు ద్వారపురెడ్డి రామ్మోహనరావు, సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షులు కె.మంగాదేవి, శ్రీకాకుళం జిల్లా మిమిక్రీ ఆర్టిస్ట్ శివ, సంఘం రాష్ట్ర కార్యదర్శి, కోశాధికారి మువ్వల వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు కర్నూలు మహాలింగప్ప, అనంతపురం కుళ్లయ్యప్ప, ప్రకాశం వరప్రసాద్, కాకినాడ రాజబాబు, వివిధ జిల్లాల పౌరాణిక నాటక రంగాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై చర్చ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. స్థానిక వైటీసీలో ఆదివారం వివిధ ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశమై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఆగస్టు 9న సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలంతా ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలకు హాజరయ్యే వారికి కల్పించాల్సిన వసతులపై చర్చించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు కోలక అవినాష్, చలపతిరావు, ప్రసాద్, నాగభూషణరావు, క్రాంతికుమార్, లోవ రాజు, పల్ల సురేష్, తదితరులు ఉన్నారు.

ముగిసిన 'శిక్షా సప్తాహ్'

భామిని: జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ) 2020 అమలు చేసిన నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక హోలీ క్రాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న గ్లో–క్లబ్ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించారు. సమాజ ఉన్నతి, దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్, గ్లో–క్లబ్ మెంటార్లు పిలుపునిచ్చారు. జాతీయ విద్యా విధానంకు మద్దతుగా బాలికలు నినాదాలు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు

పాలకొండ రూరల్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని సీఐ ఎం.చంద్రమౌళి స్పష్టం చేశారు. రెండోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా సంబంధిత అధికారులకు సిఫార్స్ చేయనున్నట్లు చెప్పారు. పాలకొండ–సీతంపేట ప్రధాన రహదారిలో ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన చోదకుల లైసెన్స్, ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల వేలం

గరుగుబిల్లి: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వేలం వేశారు. పాలకొండ ఎస్‌బీపీఈ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఒక ఆటో, నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేసినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. పాటదారులు రవాణాశాఖ నిర్ణయించిన ధరకు వేలంలో పాల్గొని వాహనాలను దక్కించుకున్నట్లు చెప్పారు. అలాగే వివిధ కేసుల్లో పట్టుకున్న 467 లీటర్ల మద్యం, 58.140 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు ఎన్.మధుసూదనరావు విద్యార్థులతో పద్యాలు, నీతి కథలు చదివించారు. అలాగే చెస్, క్యారమ్స్, తదితర ఆటలను ఆడించారు. పుస్తక పఠనం, గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

తాత్కాలిక పరిష్కారం

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామ రహదారి గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై స్పందించిన స్థానిక ఉప సర్పంచ్ టి.ఎల్లంనాయుడు ఆదివారం ట్రాక్టర్‌తో గ్రావెల్ తెప్పించి రహదారి గోతులను పూడ్చారు. రహదారి గోతులు తాత్కాలికంగా పూడ్చివేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేయాలని వారంతా కోరుతున్నారు.

సేవాభావంతో పనిచేయాలి



నిరుపేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేస్తున్న ఎస్సై, తదితరులు

బలిజిపేట: ఇండియన్ అడ్వర్టైజింగ్ సర్వీస్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన 120 మంది నిరుపేదలకు ఆదివారం నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. చారిటబుల్ ట్రస్టు సభ్యుడు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సై పాపారావు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.సుబ్బారావు సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై పాపారావు మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇండియన్ అడ్వర్టైజింగ్ సర్వీస్ చారిటబుల్ ట్రస్ట్ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఐదు కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు కె.శ్రీనివాసరావు, నారాయణస్వామి, వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మలాథియాన్ పిచికారీ



కాశీపేటలో దోమల మందు పిచికారీ చేస్తున్న కార్మికుడు

సీతానగరం: పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు, ఈఓపీఆర్డీ కె. కుమార వర్మ పర్యవేక్షణలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నారు. కొద్ది రోజుల కిందటి వరకు పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని కాశీపేట, అంటిపేట, సూరంపేట, పెదబోగిలి గ్రామాల్లో ఆదివారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ కుమారవర్మ మాట్లాడుతూ, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

- రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారి ప్రకాష్



కషాయం తయారు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారి కె. ప్రకాష్ సూచించారు. మండలంలోని పెదబొండపల్లి, బందలుప్పి, అంటివలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ సాగువల్ల భూమికి, వాతావరణానికి, మానవాళికి ఎంతో మంచి జరుగుతుందన్నారు. నేటి సమాజంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అధిక డిమాండ్ ఉందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రకృతి కషాయం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగానికి సంబంధించిన మోడల్ మేకర్లు, మెంటర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పైపు ధ్వంసం



పైపులైన్ ధ్వంసం చేయడంతో వృథాగా పోతున్న తాగునీరు

కొమరాడ: మండలంలోని కెమిశీల పంచాయతీ తులసివలసలో గ్రామంలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను గ్రామానికి చెందిన కొంతమంది యువత అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులు చేస్తున్న ప్లంబర్‌పై దాడి చేసి పైపులను ధ్వంసం చేసినట్లు స్థానిక సర్పంచ్ తాడింగి బీమయ్య ఆదివారం తెలిపారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదని, గ్రామాభివృద్ధికి అంతా కలిసి రావాలని సర్పంచ్ కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కొమరాడ: కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తమకు క్రమశిక్షణతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, పాఠశాలకు ఎంతో రుణపడి ఉంటామన్నారు.

కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రామచంద్రరెడ్డి, బి.గంగునాయుడు, శివరామప్రసాద్, బి.వి.రమణ, తదితరులు పాల్గున్నారు.

సలహాలు పాటిస్తే.. సాగు బాగు

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యం
- ఎరువుల వినియోగం, కలుపు నివారణ కీలకం



దమ్ము పొలంలో వరినాట్లపై సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

భామిని: ఖరీఫ్ సాగు పనులు ఊరందుకున్నాయి. వర్షాలు అనుకూలించడం, సాగునీరు అందుబాటులో ఉండడంతో రైతులు పొలాలను దమ్ముచేసి వరినాట్లు వేస్తున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో వరినాట్లును పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు అందిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇలా నాటుకోవాలి..

వరినాట్లు వరుస క్రమంలో వేసుకోవడం వల్ల పంట బాగుంటుంది. నాట్లు వేసే సమయంలో పొలంలో 2 సెంటీమీటర్ల కంటే తక్కువ నీరు ఉండేలా చూసుకోవాలి. మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటీమీటర్ల దూరం, వరుస మధ్య 20 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. కుదురుకు రెండు, లేదా మూడు మొనలు ఉండేలా నాటుకోవాలి. నాట్లు వేసేముందు నారు మొనలను తుంచి నాటుకోవాలి. ఇలా చేయడం ద్వారా ఆకుముడత తెగులు వ్యాప్తిని అడ్డుకోవచ్చు.

కాలిబాటలతో మేలు

వరిపొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ సిబ్బంది సూచించారు. నాట్లు పూర్తయిన పొలాల్లో ప్రతీ రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల వెడల్పులో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి.



నాట్లు వేసే ముందు కొలతలు తీస్తున్న కూలీలు

దీని వల్ల మొక్క మొదుళ్లకు గాలి, సూర్యరశ్మి పుష్కలంగా అందుతుంది. మొక్క బాగా దుబ్బు కట్టటడంతో పాటు కిరణజన్యసంయోగక్రియ బాగా జరిగి దిగుబడి పెరుగుతుంది. సుడిదోమ, చీడపీడల ఉధృతి తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు కాలిబాటలు అనువుగా ఉంటాయి.



కొర్ను సింహచలం, ఏఓ

కలుపు నివారణకు..

పంటల సాగులో సస్యరక్షణ, ఎరువుల వినియోగం చాలా కీలకం. నాట్లు వేసే ముందు దమ్ము పొలంలో పైపాటుగా 50 కేజీల డీఏపీకి, 10 కిలోల యూరియా, 10 కిలోల పోటాషియం కలిపి వేసుకోవాలి. నాట్లు వేసిన మూడు రోజులలోపు కలుపు నివారణ కోసం ఎకరాకు 80 గ్రాముల పైరాజోసల్ఫ్యూరాన్, లేదా ప్రిటీలాక్లోర్ 400 మిల్లీలీటర్లు మందును 20 కేజీల పొడి ఇసుకలో కలిపి చల్లుకోవాలి.